


TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA






| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక. 64 | బుధవారం | 30.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue. 64 | Wensday | 30.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |



## కేటీఆర్‌కు నేడు సినిమా చూపిస్తాం

- సీఎం రేవంత్ పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలను బయటపెడతాం
- సీఎంను సవాల్ చేసే స్థాయి ఆయనకు లేదు
- బీఆర్ఎస్ కీలక ప్రాజెక్టులను అడ్డుకుంటోంది
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

2



# తుమ్మిడిహట్టి బ్యారేజీకి అనుమతులు ఇప్పించండి

- మహారాష్ట్రతో ఒప్పందం కుదిరేలా చొరవ చూపాలి
- రాష్ట్ర ప్రాజెక్టులకు పర్యావరణ, అంతర్రాష్ట్ర అనుమతులు వేగంగా ఇవ్వాలి
- కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఢిల్లీలో జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ
- కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులతో పాటు పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చ



**న్యూఢిల్లీ:** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకుని, అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. దిల్లీలో కేంద్ర మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్‌ఆర్‌ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తేనే గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించినట్లు తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అనుమతుల జాప్యం కారణంగా ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం గణనీయంగా పెరుగుతోందని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

**సమ్మక్కసాగర్‌కు అనుమతులు ఇవ్వాలి**

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం కోరారు. ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే సీడబ్ల్యూసీకి సమర్పించినట్లు తెలిపారు. నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులను త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోందని వివరించారు.

**టెలీమెట్రీ వ్యవస్థ ఏర్పాటుకు విజ్ఞప్తి**

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. మొదటి దశలో టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ. 4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందని కేంద్ర మంత్రికి తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు

- హైదరాబాద్-మహబూబ్‌నగర్-రంగారెడ్డి స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డి
- నల్గొండ-వరంగల్-ఖమ్మం స్థానానికి సర్వోత్తమ్‌రెడ్డి

2



## సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు ఎందుకు?



- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం మరో 'తుగ్లక్ నిర్ణయం'
- టన్ను రూ.3,800 బొగ్గును వదిలి రూ.9,000కు దిగుమతి చేసుకోవడంపై ప్రశ్నలు
- అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## మోడీని ఎదుర్కోలేక ఈసీపై నిందలేస్తారా?



- కాంగ్రెస్ గెలిచినప్పుడు ఈవీఎంలు ఎందుకు గుర్తుకురాలేదు?
- ఎన్నికల ప్రక్రియపై ఆధారాలుంటే బయటపెట్టాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీని రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక ఎన్నికల సంఘం, ఈవీఎంలపై కాంగ్రెస్ నేతలు నిందలు వేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం సాధించినప్పుడు ఈవీఎంలపై ఎందుకు అనుమానాలు వ్యక్తం చేయలేదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని ప్రశ్నించారు. కేరళలో కాంగ్రెస్ నేతలు గతంలో తమ విజయం ఎన్నికల ప్రక్రియ వల్లే సాధ్యమైందని ప్రకటించిన విషయాన్ని సీడబ్ల్యూసీ మర్చిపోయిందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రధాని మోదీ ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించిన ఆయన.. వరుసగా మూడు సార్లు దేశ ప్రజలు తమ మద్దతు తెలిపినందుకా? భారత ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనాన్ని, భారతీయుల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నందుకా? అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వాన్ని బ్రిటిష్ పాలనతో పోల్చడం భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు.

**ఎస్ఐఆర్‌పై విమర్శలకు సమాధానం**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బండి సంజయ్ తప్పుబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేస్తున్న సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వ అధికారులేనని పేర్కొన్నారు. ప్రక్రియలో ఏవైనా తరువాయి 2 లో

# పల్లెల అభివృద్ధికి రూ.11,085 కోట్లు

పల్లె పండుగ 3.0లో 15,500 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్లు వేస్తున్నాం. అదేవిధంగా రూ.2700 కోట్లతో ఆరు వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు వేస్తున్నాం.

- రాష్ట్రవ్యాప్తంగా 15,500 కి.మీ. బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం
- ఉదయగిరి అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులు
- రూ.3,876 కోట్లతో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు
- సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్ర పునర్నిర్మాణం
- పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

2






## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా



- పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై నెట్టడం సరికాదు
- బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారంటూ కల్వకుంట్ల రామారావుపై కవిత విమర్శలు
- కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ ఫైర్

**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్రంగా స్పందించారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై నెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని విమర్శించారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్ట ఆధారాలతో అన్ని విషయాలను బయటపెడతానని హెచ్చరించారు. 'నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం' అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ దృష్టికి రాలేదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లుగా పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఈ విధానంతో బీఆర్ఎస్‌కు కేటీఆర్ గోతులు తీస్తున్నారని మండిపడ్డారు.

**అవినీతి ఆరోపణలపై ప్రశ్నలు**

తాను బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో ఓ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని విమర్శించినందుకు కొన్ని గంటల్లోనే తనను సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటి వ్యక్తితో తరువాయి 2 లో

## క్యూర్ పరిధిలో త్వరలో ఇందిరమ్మ టవర్లు

- 20 నియోజకవర్గాల్లో భూములు గుర్తించాం
- 16--17 ప్రాంతాల్లో టెండర్లు పూర్తి
- పేదల ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్.. అవసరాలకు రుణ సదుపాయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నాంపల్లిలో 480 ఇందిరమ్మ ఇళ్ల టవర్లకు భూమిపూజ చేసిన మంత్రి పొంగులేటి

2



క్యూర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో త్వరలో టెండర్లు పిలిచి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, 16--17 ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.



## ప్రజాస్వామ్య పునాదలు క్రమపద్ధతిలో ధ్వంసం

- ఎస్ఐఆర్‌లో అవకతవకలు జరుగుతున్నాయి
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలి
- బాధ్యత వహించి ప్రధాని రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

2

## ఉక్రెయిన్‌తో యుద్ధం.. అమెరికా మాజీ సైనికులకు రష్యా ఎర!

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లకు పైగా కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో ఇరుదేశాలు పరస్పరం తీవ్ర దాడులు కొనసాగిస్తున్నాయి.

- సోషల్ మీడియా ద్వారా అమెరికన్లకు వల.. రూ.కోట్లలో ఆర్థిక ప్రోత్సాహకాలు
- కనీసం 18 మంది అమెరికా జాతీయులను రష్యా సైన్యంలోకి చేర్చినట్లు అంతర్జాతీయ మీడియా

2



## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

- వరంగల్ నేతలు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారు
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలి
- కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ



2

రాముడు-శివుడిపై రేవంత్ వ్యాఖ్యలు..

## జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం

- సీఎం మాట్లాడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం
- హిందువులను విభజించే ప్రయత్నమని ఆరోపణ
- రాహుల్‌గాంధీ సూచనల మేరకే మాట్లాడారు
- బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ

2

# కేటీఆర్‌కు నేడు సినిమా చూపిస్తాం

**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల ప్రజల సమక్షంలో కేటీఆర్‌కు సంబంధించిన భూ వ్యవహారాలను సీఎం రేవంత్‌రెడ్డి బయటపెడతారని అన్నారు. తద్వారా కేటీఆర్ అసలు స్వరూపం దేశవ్యాప్తంగా తెలుస్తుందని పేర్కొన్నారు.

**శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి**

గత బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని చామల ఆరోపించారు. దాదాపు తొమ్మిదిన్నరేళ్ల పాలనలో శంకుస్థాపనలకే పరిమితమయ్యారని విమర్శించారు. చిన్నపాటి వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల మేర రైతు రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో రూ.345.75 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

**కీలక ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆరోపణ**

మెట్రో రైలు, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు

**హైదరాబాద్:** పట్టభద్రుల నియోజక వర్గాలకు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గానికి సామ రామ్మోహ న్‌రెడ్డిని, నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి సర్వోత్తమ్‌ెండ్డిని అభ్యర్థులుగా ఎంపిక చేసింది. రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకే కాంగ్రెస్ అవకాశం కల్పించింది. అభ్యర్థుల ఎంపికతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ఎన్నికల కార్యాచరణను వేగవంతం చేయనుంది. పట్టభద్రుల ఓటర్లను కలుసుకోవడంతో పాటు స్థానిక సమస్యలు, ఉద్యోగ, విద్య, ఉపాధి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రచారం నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు

**హైదరాబాద్:** పట్టభద్రుల నియోజకవర్గాలకు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గానికి సామ రామ్మోహన్‌రెడ్డిని, నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి సర్వోత్తమ్‌రెడ్డిని అభ్యర్థులుగా ఎంపిక చేసింది. రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకే కాంగ్రెస్ అవకాశం కల్పించింది. అభ్యర్థుల ఎంపికతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ఎన్నికల కార్యాచరణను వేగవంతం చేయనుంది. పట్టభద్రుల ఓటర్లను కలుసుకోవడంతో పాటు స్థానిక సమస్యలు, ఉద్యోగ, విద్య, ఉపాధి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రచారం నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది.

# అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

**వరంగల్:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు.కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

# సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు ఎందుకు?



**హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. సింగరేణి నుంచి తక్కువ ధరకు లభించే బొగ్గును కాదని అధిక ధరకు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలనే నిర్ణయం ప్రభుత్వ మరో 'తుగ్లక్ నిర్ణయం' అని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 చెల్లించి బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్కువ ధరకు రాష్ట్రంలోనే బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ అధిక ధరకు దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిర్ణయం వల్ల అదనంగా పడే ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని నిలదీశారు.

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ గతంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరా కొనసాగిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పుష్కలమైన బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా అధిక ధరకు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు కొనుగోలు నిర్ణయం వల్ల ఎవరికి ప్రయోజనం చేకూరుతుందో ప్రభుత్వం వెల్లడించాలని కేటీఆర్ ప్రశ్నించారు.

# ఉక్రెయిన్‌తో యుద్ధం.. అమెరికా మాజీ సైనికులకు రష్యా ఎర!

**మాస్కో:** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లకు పైగా కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో ఇరుదేశాలు పరస్పరం తీవ్ర దాడులు కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రష్యా సైన్యంలో విదేశీయుల నియామకానికి సంబంధించి మరో అంశం వెలుగులోకి వచ్చింది. అమెరికా పౌరులను సైతం సోషల్ మీడియా ద్వారా ఆకర్షించి రష్యా సైన్యంలోకి చేర్చుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

అమెరికన్లను రష్యా తరఫున యుద్ధంలో పాల్గొనేలా చేసేందుకు కొందరు ఏజెంట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నట్లు ఆ కథనం పేర్కొంది. టిక్‌టాక్, ఫేస్‌బుక్ తదితర వేదికలపై ఆర్థిక ప్రోత్సాహకాల హామీలు ఇస్తున్నట్లు తెలిపింది. ఒక్కసారి చెల్లించే సైనింగ్ బోనస్‌గా 26 వేల డాలర్లు, నెలకు 2 వేల డాలర్ల వరకు జీతం ఇస్తామని ఆఫర్లు చేస్తున్నట్లు పేర్కొంది. పేదలు, అమెరికా వ్యతిరేక భావజాలం ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని ఈ నియామకాలు సాగుతున్నట్లు ఉక్రెయిన్ నిఘా వర్గాలను ఉటంకిస్తూ కథనం తెలిపింది. ఇప్పటివరకు కనీసం 18 మంది అమెరికా పౌరులను రష్యా దళాల్లోకి చేర్చుకున్నట్లు పేర్కొంది. వారిలో కొందరు మాజీ సైనికులు ఉన్నట్లు తెలిపింది. రష్యా సైన్యంలో చేరిన విదేశీయులను యుద్ధభూమిలో ముందువరుసలో మోహరిస్తున్నారని ఉక్రెయిన్ నిఘా వర్గాలు ఆరోపించినట్లు కథనం పేర్కొంది. దీంతో కొందరు రష్యా సైన్యంలో చేరిన కొద్దికాలానికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అయితే ఈ వివరాలపై స్వతంత్ర ధ్రువీకరణకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేదు. ఇదిలా ఉండగా.. రష్యా తరఫున ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉత్తరకొరియా సైనికులు పాల్గొంటున్నారని ఇప్పటికే ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. తాజాగా మరో 10 వేల మంది ఉత్తరకొరియా సైనికులను రష్యాకు పంపేందుకు కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆరోపించారు. గతంలోనూ రష్యాకు పెద్ద సంఖ్యలో ఉత్తరకొరియా సైనికులను పంపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు రష్యా దళాల తరఫున పోరాడుతున్న 135 దేశాలకు చెందిన సుమారు 29 వేల మందిని గుర్తించినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. వాస్తవ సంఖ్య దీనికంటే ఎక్కువగా ఉండొచ్చని వారు పేర్కొన్నట్లు కథనం తెలిపింది.

# పల్లెల అభివృద్ధికి రూ.11,085 కోట్లు



**నెల్లూరు:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం 'పల్లె పండుగ – 3' కార్యక్రమాన్ని ప్రారంభించింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో మంగళవారం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో గ్రామీణ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

2024 ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తున్నామని చంద్రబాబు అన్నారు. తన అనుభవం, పవన్ కల్యాణ్ ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని, కనీస మౌలిక వసతులు కూడా సరిగా లేవని విమర్శించారు.

**15,500 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం**

'పల్లె పండుగ – 3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు సీఎం వెల్లడించారు. అదనంగా రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు రహదారి సౌకర్యాలు మెరుగుపరచడమే లక్ష్యమన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో 880 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే నిర్మించగా, తమ ప్రభుత్వం రెండేళ్లలో 6,500 కిలోమీటర్ల రోడ్లు నిర్మించిందని చంద్రబాబు పేర్కొన్నారు. గ్రామాల్లో ఖర్చు చేసే ప్రతి రూపాయి అభివృద్ధి పనుల రూపంలో కనిపించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**పంచాయతీరాజ్ శాఖకు ప్రశంసలు**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని చంద్రబాబు అన్నారు. సుమారు రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పదోన్నతులు కల్పించామని, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడాన్ని ప్రస్తావించారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి పలు ప్రాజెక్టులను ప్రకటించారు. 65 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్–1 భూసేకరణకు రూ.85 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 వేల ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించాలన్నది లక్ష్యమని పేర్కొన్నారు.వెలిగొండ ఫేజ్ – 2 పూర్తి చేసి మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉపాధి కల్పించే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లాను లాజిస్టిక్స్ హబ్‌గా, ఉదయగిరిని పండ్లతోటల హబ్‌గా అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు, దగదర్తి విమానాశ్రయం వంటి అవకాశాలతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ ప్లాంట్ వస్తోందని, యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

పేదలకు 'మీ ఇల్లు – మీ హక్కు' కింద పట్టాలు అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు సెమీకండక్టర్ ప్రాజెక్టులు, డేటా సెంటర్లు, స్పేస్ సిటీ, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను తీసుకొస్తున్నామని వివరించారు. సుస్థిరమైన ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

**సంక్షేమం, పెట్టుబడులకు ప్రాధాన్యం**

ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4 వేల పింఛను వంటి పథకాలతో ప్రజలకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కేంద్ర సహకారంతో చర్యలు చేపట్టామని చెప్పారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, వాటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య పునాదులు క్రమపద్ధతిలో ధ్వంసం

**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడి తెచ్చారనే ఆరోపణల నేపథ్యంలో.. ఆయన నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగ గబద్ధమైన స్వతంత్ర సంస్థలను క్రమపద్ధతిలో బలహీన పరుస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై ఆయన ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.

**ఓటర్ల జాబితా మార్పులపై పూర్తి సమాచారం ఇవ్వాలి**

ఓటర్ల జాబితాల్లో చేసిన మార్పులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని బహిర్గతం చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలు, సంబంధిత సమాచారాన్ని సకాలంలో సులభంగా అందుబాటులో ఉంచాలని కోరారు. జాబితాల నుంచి పేర్లు తొలగించిన ఓటర్లకు సమాచారం అందించి, అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలకు ఆధారాలు లభిస్తే స్వతంత్ర, కాలపరిమితితో కూడిన దర్యాప్తు చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రతి భారతీయుడి ఓటు భద్రంగా ఉందన్న నమ్మకం కలిగేలా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**సీఈసీపై తీవ్ర విమర్శలు**

ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు సీఈసీ నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఖర్గే పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జ్ఞానేశ్‌కుమార్ సీఈసీగా కొనసాగడానికి నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. ఆయనను ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇవి కాంగ్రెస్ చేసిన ఆరోపణలు కాగా, ఎన్నికల సంఘం మాత్రం తన చర్యలు చట్టబద్ధమైనవేనని, కమిషన్‌లో అంతర్గత చర్చలు సాధారణ ప్రక్రియలో భాగమని చెబుతోంది.

**అవసరమైతే రోడ్డెక్కుతాం**

ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ శ్రేణులు పోరాడాలని ఖర్గే పిలుపునిచ్చారు. అవసరమైతే పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పలు డిమాండ్లతో తీర్మానాలు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఎన్నికల జాబితాల అంశంపై పోరాటానికి మద్దతుగా నిలిచిన రాహుల్‌గాంధీతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలకు ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు.

# క్యూర్ పరిధిలో త్వరలో ఇందిరమ్మ టవర్లు



**హైదరాబాద్:** క్యూర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో త్వరలో టెండర్లు పిలిచి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, 16--17 ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. నాంపల్లిలోని రెడ్‌హిల్స్‌లో 480 ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు ఫ్లాట్ల కేటాయింపు పత్రాలను మంత్రులు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోందని పొంగులేటి అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లను నిర్మించారని, అక్కడ నివసించే పేదలకు ఉపాధి అవకాశాలపై సరైన ఆలోచన చేయలేదని విమర్శించారు. పేదల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా నగరంలోని విలువైన ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్లను నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఇళ్ల నిర్మాణంపై గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించిన మంత్రి.. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలోనే గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల కంటే రెట్టింపు ఇళ్లను నిర్మించి చూపిస్తానని అన్నారు. ఈ అంశంపై తాను గతంలో కేటీఆర్‌కు సవాల్ చేసినప్పటికీ ఆయన నుంచి సమాధానం రాలేదని పేర్కొన్నారు.

**రూ.43.20 కోట్లతో మరో టవర్**

క్యూర్ పరిధిలో మరో ఇందిరమ్మ టవర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ టవర్‌ను రూ.43.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ టవర్ల లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఉచితం**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తామని మంత్రులు తెలిపారు. భవిష్యత్తులో పిల్లల చదువులు, వివాహాలు వంటి అవసరాలకు ఇళ్లపై రుణాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు శాశ్వత నివాసం కల్పించడంతో పాటు వారి ఆర్థిక భద్రతకు కూడా ఈ ఇళ్లు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# రాముడు-శివుడిపై రేవంత్ వ్యాఖ్యలు.. జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం

**న్యూఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. ఉత్తర, దక్షిణ భారతదేశాల రాజకీయ, సాంస్కృతిక గుర్తింపులతో పాటు శ్రీరాముడు, శివుడి ఆరాధనను ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రేవంత్ వ్యాఖ్యలు ప్రజల మధ్య విభజనకు దారితీసేలా ఉన్నాయని బీజేపీ నేతలు విమర్శించారు. ఢిల్లీలో జరిగిన ఓ మీడియా కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి బీజేపీ నినాదాలను ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ నేతలు తరచూ 'జై శ్రీరామ్' నినాదాన్ని ఉపయోగిస్తారని, అదే విధంగా 'హర హర మహాదేవ్' ఎందుకు అనరని ప్రశ్నించారు. తాము ద్రావిడులమని, ఉత్తర భారతదేశానికి చెందిన వారు ఆర్యులని, తాము శివభక్తులమని, వారు శ్రీరాముడి భక్తులని రేవంత్ వ్యాఖ్యానించారు. బీజేపీ శ్రీరాముడిని రాజకీయంగా తమవైపు తీసుకుందని ఆయన ఆరోపించారు. 'హర హర మహాదేవ్' నినాదాన్ని బీజేపీ నేతలు వేదికలపై ఎందుకు చేయరని ప్రశ్నించారు. అంతేకాకుండా శివుడిని 'పేదల దేవుడు', శ్రీరాముడిని 'ధనవంతుల దేవుడు'గా రేవంత్ అభివర్ణించారు. అయితే ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా ఆయన పేర్కొన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల రాజకీయ సంస్కృతుల్లో తేడాలు ఉన్నాయనే తన వాదనలో భాగంగానే ఈ వ్యాఖ్యలు చేశారు.

రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. హిందువులను శ్రీరాముడు, శివుడి భక్తులుగా విడదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసం మత, ప్రాంతీయ గుర్తింపులను ఉపయోగిస్తున్నాయంటూ విమర్శించారు. బీజేపీ జాతీయ మీడియా సహ ఇన్‌చార్జి, అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ.. రాహుల్‌గాంధీ సూచనల మేరకే రేవంత్‌రెడ్డి ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. హిందువులను విభజించేందుకు కాంగ్రెస్ కొత్త మార్గాలను అన్వేషిస్తోందని ఆయన సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. రాముడు, శివుడి భక్తుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు ఫలించవని అన్నారు. ఇవి భండారీ చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమేనని, వాటిని స్వతంత్రంగా నిర్ధారించిన వాస్తవాలుగా చూడలేమని సంబంధిత నివేదికలు పేర్కొన్నాయి.

**'మోదీ హర హర మహాదేవ్ కూడా అంటారు'**

బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' నినాదం చేయరన్న రేవంత్ వ్యాఖ్యలను ప్రదీప్ భండారీ తోసిపుచ్చారు. ప్రధాని మోదీ 'జై శ్రీరామ్'తో పాటు 'హర హర మహాదేవ్' నినాదాన్ని కూడా చేస్తారని ఆయన పేర్కొన్నారు. శ్రీరాముడు లంకకు వెళ్లే ముందు శివుడిని ఆరాధించారనే రామాయణంలోని కథనాన్ని ప్రస్తావిస్తూ.. రాముడు, శివుడి భక్తులను వేరు చేసి చూడటం సరికాదని వ్యాఖ్యానించారు. రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేయగా, కాంగ్రెస్ నేతలు మాత్రం బీజేపీనే మతపరమైన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని ప్రత్యారోపణలు చేశారు. దీంతో రాముడు--శివుడు, ఉత్తర--దక్షిణ రాజకీయ గుర్తింపుల అంశం మరోసారి కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

# మోడీని ఎదుర్కోలేక ఈసీ, ఈవీఎంలపై నిందలేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దుకునేందుకు చట్టబద్ధమైన వ్యవస్థ ఉందన్నారు. ప్రతి అంశానికీ కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని విమర్శించారు. ఎస్ఐఆర్ కొత్త ప్రక్రియ కాదని, గతంలోనూ ఇలాంటి ప్రక్రియను నిర్వహించారని తెలిపారు. దీనిని సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎవరు గెలవాలనేది ప్రజలు నిర్ణయిస్తారని, ఎవరు ఓటు వేయాలనేది చట్టబద్ధమైన ఓటరు జాబితా నిర్ణయిస్తుందని బండి సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంత పవిత్రమైనదో, ఓటరు జాబితా కూడా అంతే పారదర్శకంగా, విశ్వసనీయంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం చేసిన తప్పేమిటో స్పష్టంగా చెప్పాలని, ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టాలని కాంగ్రెస్ నేతలకు బండి సంజయ్ సవాల్ విసిరారు.

# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమ అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది కేటీఆర్‌నని కవిత ఆరోపించారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన ఓ మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని ఆరోపించారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్ట ఆధారాలతోనే ప్రతి అంశంపై మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని కేటీఆర్‌ను హెచ్చరించారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి బుధవారం 30 సెప్టెంబర్ 2026





## వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- రఘునాథపూర్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు
- పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసలు

**తొలివెలుగు, రాజాపేట :** వృద్ధుల క్షేమం, సాధికారత వారోత్సవాల్లో భాగంగా రాజాపేట మండలం రఘునాథపూర్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టీఏఎస్‌సీఏ) మండల శాఖ, ఎంఈఓ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో "తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ బాధ్యత ఎవరిది?" అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. విద్యార్థుల్లో వృద్ధుల పట్ల గౌరవం, సామాజిక స్పృహ పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పోటీల్లో 10వ తరగతి బి-విభాగం విద్యార్థి బీతోజు మహేష్ ప్రథమ స్థానంలో నిలవగా, 10వ తరగతి ఎ-విభాగం విద్యార్థిని చాగంటి సాయి వర్షిత ద్వితీయ స్థానాన్ని, 10వ తరగతి ఎ-విభాగానికి చెందిన పొట్టబత్తిని కృష్ణ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, నిర్వహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శివరామకృష్ణ, తెలుగు పండితులు శ్రీహరి, స్వప్న, టీఏఎస్‌సీఏ మండల ఉపాధ్యక్షుడు మిట్ట అంజయ్య, గ్రామ శాఖ కార్యదర్శి పెండెమ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సేవలో దాతృత్వం

- వాలంటీర్‌కు రూ.5 వేల వేతనం అందజేత
- ప్రాథమిక విద్య బలోపేతానికి అందరూ కృషి చేయాలి: రామచంద్రరెడ్డి



**తొలివెలుగు, రాజాపేట :** నాయకులు, దాతల సహకారంతోనే ప్రాథమిక విద్య మరింత బలోపేతమవుతుందని దాత కంచర్ల రామచంద్రరెడ్డి అన్నారు. మండలంలోని చల్లూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న విద్యా వాలంటీర్ గుంటి శిరీషకు మంగళవారం ఆయన ఒక నెల వేతనం రూ.5 వేల రూపాయలను నగదు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, ప్రతీ ఒక్కరూ విద్యాభివృద్ధికి తమవంతు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి రామచంద్రరెడ్డి అందిస్తున్న సహాయ సహకారాలు, ఆయన సేవాభావం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజ హితం కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బింగి శ్రీను, ఉపాధ్యాయులు సరిత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా నిలవడమే 'సేవా సంకల్పం'

- సాధనా ఆశ్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో అన్నదానం
- పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్

**తొలివెలుగు, వలిగొండ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని టేకులసోమారం గ్రామంలో గల సాధనా మానసిక వికలాంగుల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పదులది రాంచందర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయ కార్యక్రమాలతో పాటు సమాజంలో అట్టడుగున ఉన్నవారికి, మానసిక దివ్యాంగులు, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అండగా నిలవడమే ఈ సేవా సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆశ్రమంలోని దివ్యాంగులకు ఆహారం అందజేసి, వారితో కొంత సమయం గడిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పాలసీ సెల్ కన్వీనర్ సర్వీ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, వలిగొండ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు బలరాం, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగు నర్సింహారావు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా నాయకులు మహేష్ గౌడ్, బెల్లంకొండ కిరణ్, రాములు, రాజు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- 89 మంది లబ్ధిదారులకు రూ.52 లక్షల చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి లబ్ధిదారుల కృతజ్ఞతలు



**తొలివెలుగు, వలిగొండ :** అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక కొండంత అండగా నిలుస్తుందని వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ తెలిపారు. మండల పరిధికి చెందిన 89 మంది లబ్ధిదారులకు మంజూరైన సుమారు రూ.52 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని లబ్ధిదారులకు సత్వరమే సహాయం అందేలా కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఆర్థిక సాయం అందేలా చూసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాశం సత్తిరెడ్డి, తుమ్మల యుగేందర్ రెడ్డి, కాసుల వెంకన్న గౌడ్, సత్యనారాయణ, దండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.





# చౌటుప్పల్‌ను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- రూ.15 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అంజనా సాయి మేడోస్ కాలనీ, 14వ వార్డు రాజేంద్రనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్‌లతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ప్రజలకు అవసరమైన డ్రైనేజీ, రహదారులు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. చౌటుప్పల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## 'విబి-జి-రామ్ జి' పథకం పనుల గుర్తింపు

- ఉప్పలపహాడ్‌లో సోషల్, రిసోర్స్ మ్యాప్‌ల రూపకల్పన
- గ్రామ పంచాయతీ సర్పంచ్ చిన్నం బీరప్ప

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా 'విబి-జి-రామ్ జి' పథకం ద్వారా ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తించాలని ఉప్పలపహాడ్ సర్పంచ్ చిన్నం బీరప్ప అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపహాడ్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం ఆయన అధ్యక్షతన పనుల గుర్తింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ ఆవరణలో గ్రామానికి చెందిన సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్‌లను స్థానికులతో కలిసి తయారు చేశారు. గ్రామంలో రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విధుల్లో సమయపాలన పాటించాలి

- ఉగ్గంపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్
- మందుల నిల్వలు, వ్యాక్సినేషన్ పరిశీలన

**తొలివెలుగు, చిన్నగూడూరు :** వైద్యారోగ్య సిబ్బంది విధుల్లో ఖచ్చితమైన సమయపాలన పాటిస్తూ ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (డైరెక్టర్) డాక్టర్ రవీంద్ర నాయక్ ఆదేశించారు. చిన్నగూడూరు మండల పరిధిలోని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో లభ్యమవుతున్న మందుల నిల్వలను, వ్యాక్సినేషన్ నిల్వలను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దఅనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌తో మాట్లాడి సిబ్బంది పనితీరు, టార్గెట్ల సాధనపై సమీక్షించారు. ప్రతీ గర్భిణి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన ఎన్‌సీవీడీసీఎస్, ఎన్‌టీఈపీ, ఎంఎల్ఈపీలతో పాటు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఏఏఎం) కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఏఏఎం కేంద్రాల్లో నిర్ణీత 12 రకాల వైద్య సేవలు విధిగా అందేలా చూసాలని సూచించారు. పీహెచ్‌సీలో సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీలా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, డీఐవో శివకుమార్, అర్జున్, విరాజిత, డీపీవో నిలోహణ, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, టీబీ హెచ్‌వీ జాతోత్ సాయికృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



# రైతు ఆర్థిక బలోపేతమే లక్ష్యం








- రైతులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా సింగిల్ విండో
- చైర్మన్ ఈడ్దుల మస్తాన్‌బాబు యాదవ్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సింగిల్ విండో సహకార సంఘం ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తామని చైర్మన్ ఈడ్దుల మస్తాన్‌బాబు యాదవ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆరు నెలల జమా ఖర్చుల వివరాలను సభ్యులకు వివరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు, ప్రభుత్వానికి మధ్య సింగిల్ విండో వారధిగా పనిచేస్తుందని తెలిపారు. రైతాంగానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పిలాయిపల్లి కాలువ ద్వారా రైతులకు మరింత సాగునీరు అందేలా కృషి చేస్తానన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల నియంత్రణతోపాటు భూగర్భ జలాల పరిరక్షణ, పెంపుదలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. జైకేసారం పరిధిలో నూతన గోదాం నిర్మాణానికి 3.14 ఎకరాల స్థలాన్ని సేకరించినట్లు వెల్లడించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి, సభ్యులు బొబ్బిళ్ల రాజేందర్, నల్ల నరేందర్‌రెడ్డి, బత్తుల శ్రీహరి, ఎర్ర పెంటయ్య, మేకల దేవేందర్‌రెడ్డి, పానుగోతు లచ్చిరాం నాయక్, రావుల స్వామి, గుర్రం మనోహర్‌రెడ్డి, మల్కాపురం సుగుణమ్మ, ఆందోళ్ మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ కంచర్ల అశ్విన్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్లు చీరిక సంజీవరెడ్డి, చెన్నగోని అంజయ్యగౌడ్, రైతులు ఢిల్లీ చంద్రకళ, సవిరెడ్డి జనార్దన్‌రెడ్డి, బొడిగె ఆనంద్, బూరుగు కృష్ణారెడ్డి, సుర్కంటి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మల్కంబ్‌లో అదరగొట్టిన క్రీడాకారులు





- రాష్ట్ర స్థాయి పోటీలకు 24 మంది క్రీడాకారుల ఎంపిక
- ఉత్సాహంగా ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలు
- సాంప్రదాయ క్రీడలకు ఆదరణ పెరగాలి: ఎంఈఓ గురువారావు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14, అండర్-17 బాల, బాలికల మల్కంబ్ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని మల్కంబ్‌లో తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి గురువారావు మాట్లాడుతూ.. మల్కంబ్ వంటి భారతీయ సాంప్రదాయ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, ఏకాగ్రత, సమతుల్యత, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ఎంపికైన క్రీడాకారులు:**

అండర్-14 బాలికలు: ఎన్. వైష్ణవి, ఎం. మేఘన, పి. హారిణి, కె. కావ్యశ్రీ, చ. హర్షిత, ఎన్. నిత్యశ్రీ. అండర్-14 బాలురు: బి. చరణ్, వేదమానస్, డి. యశ్వంత్, చ. విఘ్నేష్, చ. సంజయ్‌కుమార్, బి. ఆదిత్య. అండర్-17 బాలురు: చ. దీక్షిత్, యు. రాధేశ్యామ్, పి. శశాంక్, జి. చిద్విలాస్, కె. కరణ్, ఎ. సాయికార్తిక్. అండర్-17 బాలికలు: ఎ. ఆకాంక్ష, ఎన్. మోక్షిత, కె. కృతిక, ఎ. వైష్ణవి, ఎస్. సహితి, జి. ప్రణవి. కార్యక్రమంలో పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య, కొయ్యలగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు మట్టయ్య, ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం బాధాకరం



**కుల్కచర్ల, తొలివెలుగు:** హిందూ సమాజం అత్యంత పవిత్రంగా ఆరాధించే శ్రీ రాముడు, పరమశివుడిని రాజకీయ ప్రయోజనాల కోసం పేదలు--ధనికులు, ఉత్తరాది--దక్షిణాది అంటూ విభజించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ పార్టీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు కుల్కచర్ల మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కుల్కచర్ల మండల కేంద్రంలో గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ పార్టీ జిల్లా కన్వీనర్ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్ హాజరై, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరిహరులు ఒక్కటేనని, భక్తికి ప్రాంతం, కులం, ఆర్థిక స్థాయి అనే భేదాలు ఉండవని అన్నారు. కోట్లాది మంది హిందువులు ఆరాధించే శ్రీరాముడు, పరమశివుడిని రాజకీయాల్లోకి తీసుకువచ్చి వారి భక్తి విశ్వాసాలను విభజించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ముఖ్యమంత్రి దేవుళ్లను రాజకీయాలకు ఉపయోగించుకోవడం బాధాకరమన్నారు. హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసే విధంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, హిందూ సమాజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్వాల్ల అంజిలయ్య, దిశా కమిటీ సభ్యులు డాక్టర్ జానకిరామ్ చవాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బృంగి హరికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు రజాక్ పాషా, ఉప సర్పంచ్ విజయకుమార్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడుసు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు, మండల ఉపాధ్యక్షులు కొండ అంజి, సేవా సంపర్ అభియాన్ కన్వీనర్ గాదే మల్లేష్, నీరటి కర్ణయ్య, కుమ్మరి గోపాల్ ఇప్పాయిపల్లి వెంకటయ్య, నేరటి సంజు, కృష్ణయ్య, ఇప్పాయిపల్లి వెంకట రాములు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# పబ్బు రాజు గౌడ్‌ను పరామర్శించిన ఎంపీ చామల

- వజ్రమ్మ మృతి పట్ల సంతాపం.. కుటుంబ సభ్యులకు పరామర్శ

**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ తల్లి పబ్బు వజ్రమ్మ ఇటీవల మృతి చెందడంతో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం మల్కాపురం గ్రామంలో రాజు గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం గ్రామంలో ఉన్న రాజు గౌడ్ స్వగృహానికి చేరుకున్న ఎంపీ.. వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మ గౌడ్, శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి, చౌటుప్పల్ 8వ వార్డు కౌన్సిలర్ బద్రి గాలయ్య, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, వార్డు సభ్యులు పక్కిరు వంశీధర్ రెడ్డి, ఇంద్రసేన రెడ్డి, దొనకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దివిస్ పరిశ్రమ సామాజిక సేవలు అభినందనీయం

- కొయ్యలగూడెంలో ఉచిత వైద్య శిబిరం.. నోట్‌పుస్తకాల పంపిణీ
- సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్







**తొలివెలుగు, చౌటుప్పల్ :** పరిసర గ్రామాల సమగ్ర అభివృద్ధికి దివిస్ పరిశ్రమ అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని కొయ్యలగూడెం సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్ అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థుల కోసం దివిస్ యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థుల విద్య, ఆరోగ్యానికి దివిస్ పరిశ్రమ అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. వైద్య శిబిరంలో 480 మంది విద్యార్థులకు నిపుణులైన వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం రూ.2,68,356 విలువైన నోట్‌పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దుర్గయ్య, యాదయ్య, ఉపాధ్యాయ బృందం, వైద్యులు, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు బి. గోపి, బి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్టియు సుల్తాన్‌పూర్ ర్యాగింగ్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

**సంగారెడ్డి, తొలివెలుగు:** జెఎన్టియు సుల్తాన్‌పూర్ కళాశాల పరిధిలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశంపై విద్యార్థుల మధ్య జరిగినట్లు పేర్కొంటున్న ఘర్షణపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌కు, టిఆర్పీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు నవాజ్ , యుఎస్‌ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు సందీప్ తో కలిసి వినతిపత్రం సమర్పించారు. కళాశాలలో విద్యార్థుల భద్రత, ప్రశాంతమైన విద్యా వాతావరణం అత్యంత ముఖ్యమని ఆ నాయకులు పేర్కొన్నారు. ఘటనకు అసలు కారణాలను గుర్తించేందుకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కళాశాల నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ర్యాగింగ్‌కు దారితీసిన పరిస్థితులను కూడా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాంటీ-ర్యాగింగ్ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థులందరికీ సురక్షితమైన, ప్రశాంతమైన విద్యా వాతావరణం కల్పించాలని టిఆర్పీ పార్టీ, యుఎస్‌ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.



TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి బుధవారం 30 సెప్టెంబర్ 2026


# ఇరగవరం మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణ




**ఇరగవరం,తొలివెలుగు:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరగవరం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మండల ప్రత్యేక అధికారి కె.వి.వి. సత్యనారాయణ ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సమాజం భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. ఎస్ఎంసీ కమిటీలు పాఠశాలల అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, రోజువారీ అధ్యయన విధానం, పదో తరగతి పరీక్షలకు చేస్తున్న సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ప్రతిరోజూ పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ సమయపాలనతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని, చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎస్ఎంసీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు.

# ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో స్వయం ఉపాధికి ప్రోత్సాహం

**ఔత్సాహికులకు రుణాల మంజూరులో జాప్యం చేయొద్దు**

**చిన్నచిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించవద్దు**

**15 రోజుల్లోగా లక్ష్యాలను సాధించి మెరుగైన ఫలితాలు చూపాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం,తొలివెలుగు:** "ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరిని పారిశ్రామికవేత్తగా, స్వయం ఉపాధి పొందే వ్యక్తిగా తీర్చిదిద్దే దిశగా వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అర్హులైన ఔత్సాహికులకు రుణాలు సకాలంలో మంజూరు చేసి, వారు తమ వ్యాపారాలను ప్రారంభించేలా బ్యాంకర్లు, శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, బ్యాంకర్లు తదితర శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల అభివృద్ధి పథకం (పీఎంఎఫ్ఎంఈ), పీఎం స్వనిధి, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన తదితర పథకాల అమలు ద్వారా ఔత్సాహికులకు రుణాల మంజూరు, లక్ష్యాల సాధన, పెండింగ్ దరఖాస్తులు, గ్రౌండింగ్ తదితరా అంశాలపై సమీక్షించారు. అనంతరం జిల్లాలోని వివిధ బ్యాంకుల సమన్వయకర్తలతో వీడియో సమావేశం నిర్వహించి రుణాల మంజూరు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యం ద్వారా ప్రతి ఇంట్లో కనీసం ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంచడం, కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రుణాలు, రాయితీలు అందిస్తూ ఔత్సాహికులను ప్రోత్సహిస్తోందన్నారు. వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆసక్తితో ముందుకు వచ్చే ఔత్సాహికులను చిన్నచిన్న కారణాలతో బ్యాంకుల చుట్టూ తిప్పుకోవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. రుణం కోసం వచ్చిన వ్యక్తిని వివిధ కారణాలతో జాప్యం చేసి, నిరుత్సాహపరిచి వెనక్కి వెళ్లే పరిస్థితి కల్పించకూడదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యంత తీవ్రమైన, నిబంధనలకు సంబంధించిన కారణాలు ఉన్నప్పుడే దరఖాస్తులను తిరస్కరించాలని, చిన్నచిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించవద్దని బ్యాంకర్లకు స్పష్టం చేశారు. ప్రత్యేకంగా పీఎం స్వనిధి పథకం ద్వారా అట్టడుగు స్థాయిలో ఉన్న చిన్న వ్యాపారులు, పేదలు స్వయం ఉపాధి పొందేందుకు రుణాల మంజూరులో అనవసరంగా సిబిల్ స్కోరు అంశాన్ని ప్రస్తావించి దరఖాస్తుదారులను నిరుత్సాహపరచవద్దని సూచించారు. డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. 100 శాతం లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకుని శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. 15 రోజుల తర్వాత మరోసారి సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి స్పష్టమైన పురోగతి కనిపించాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను, బ్యాంకుల కోఆర్డినేటర్లను ఆదేశించారు. బ్యాంకులకు వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఫలితాలు సాధించని పక్షంలో తదుపరి సమీక్షకు సంబంధిత బ్యాంకుల సమన్వయకర్తలు స్వయంగా హాజరై పురోగతిపై సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మెప్మా ఆధ్వర్యంలోని జీవనోపాధి ప్రోత్సాహక కార్యక్రమం కింద భీమవరం నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడాకు సమర్పించిన 19 దరఖాస్తుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పంట సాగుదారు హక్కు కార్డుల (సీసీఆర్‌సీ) ఆధారంగా రుణాలు అందించే ప్రక్రియపై కూడా కలెక్టర్ సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో 81 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలుసుకుని, వాటి పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు సాధ్యమైనంత మేరకు అండగా నిలవాలని, రుణాల కోసం వారిని అనవసరంగా ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద రూ.91 లక్షల విలువైన 44 యూనిట్లకు రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పథకం ద్వారా అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 60 శాతం, సాధారణ వర్గాలకు 40 శాతం సబ్సిడీ అందుతున్నందున, ఈ పథకాన్ని విస్తృతంగా అమలు చేసి మరింత మందికి ప్రయోజనం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న రుణాలను అర్హులైన ఔత్సాహికులకు సకాలంలో అందించడం ద్వారా జిల్లాలో స్వయం ఉపాధి, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి మరింత ఊతం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమీక్షలో డిఆర్డిఏ పిడి ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్, పరిశ్రమల శాఖ అధికారి యు మంగపతి, డిపిఎం ఆర్ కుసుమకుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యం వి జాన్ మార్టిన్, మెప్మా అధికారి హెబ్సిబా, జిల్లా చేనేత జౌలి శాఖ అధికారి కె అప్పారావు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొచ్చిలో నారా లోకేశ కు ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలు

**సౌత్ ఇండియా సదస్సు కోసం కేరళలోని కొచ్చికి మంత్రి లోకేశ్**

**ఏపీ ప్రగతి పథంపై సదస్సులో కీలక ప్రసంగం చేయనున్న లోకేశ్**

**పాలన, విద్య, ఉపాధి అవకాశాలపై చర్చించనున్నట్లు వెల్లడి**

**కొచ్చిలో తెలుగు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించిందన్న మంత్రి**

**రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం**



**కొచ్చి,తొలివెలుగు:** ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ కేరళలోని కొచ్చి చేరుకున్నారు. కొచ్చి వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా టుడే సౌత్ ఇండియా సమ్మిట్'లో పాల్గొనేందుకు ఆయన అక్కడికి వచ్చారు. ఈ సదస్సులో ఆయన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతి ప్రస్థానంపై కీలక ప్రసంగం చేయనున్నారు. "ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానం -- పాలన, అభివృద్ధి, విద్య, ప్రపంచ స్థాయి లక్ష్యాలు" అనే అంశంపై మంత్రి లోకేశ్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలన, ఆర్థికాభివృద్ధి, విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలను ఆయన వివరించనున్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా ఆయన ఈ వేదికపై ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. తన పర్యటనపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "కొచ్చిలో అడుగుపెట్టిన నాకు తెలుగు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్‌లో పాల్గొంటుండడం సంతోషంగా ఉంది. దక్షిణాదిలో అవకాశాలను తీర్చిదిద్దడంపై జరిగే ఈ చర్చలో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కొచ్చిలో లోకేశ్ కు స్వాగతం పలికిన వారిలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ కూడా ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ, పారిశ్రామిక, విద్యా రంగ నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ విధానాలను, అభివృద్ధి నమూనాను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఇది ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుంది. ఈ సదస్సులో మంత్రి లోకేశ్ ప్రసంగంపై రాష్ట్రంలోని రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

**ఇరగవరం, తొలివెలుగు:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెనుగొండకు చెందిన పాడాల రామకృష్ణారెడ్డి (సుమారు 5:00 గంటలకు) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. రామకృష్ణారెడ్డి తన కుమారుడిని తణుకులో బస్సు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై పెనుగొండ నుంచి తణుకు వెళ్లారు. కుమారుడిని బస్సు ఎక్కించిన అనంతరం తిరిగి పెనుగొండకు వస్తుండగా ఇరగవరం మండలం గోటేరు గ్రామ శివారులో బంక్ ఎదురుగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రామకృష్ణారెడ్డికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, పరిస్థితి విషమించడంతో ఉదయం సుమారు 11 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం ఏపీ 39 ఎల్‌వై 7973, లారీ నంబర్ ఏపీ 39 వీ 2445గా పోలీసులు గుర్తించారు. ఘటనపై ఇరగవరం ఎస్ఐ ఎం.డి. నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది: కారెం బాబూరావు



**ఇరగవరం, తొలివెలుగు:** తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలం కొత్తపాడు సొసైటీ (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం సొసైటీ సీఈఓ బోనం రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు కారెం బాబూరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు సక్రమంగా కురవని పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో కాలువలు తవ్వించడం, పూడికతీత పనులు చేపట్టడం ద్వారా రైతులకు సాగునీరు అందించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గతంలో ధాన్యం విక్రయాలకు రైతులు ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతులు తమకు అనుకూలమైన ప్రాంతాల్లో ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉందని తెలిపారు. ధాన్యం విక్రయించిన అనంతరం 48 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతున్నట్లు పేర్కొన్నారు. కౌలు రైతులకు కూడా సొసైటీల ద్వారా వ్యవసాయ రుణాలు అందించే అంశంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బాబూరావు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ పెనుగొండ బ్రాంచ్ మేనేజర్ ఎస్. వల్లి దేవసేన, సూపర్‌వైజర్ సత్యనారాయణ, సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యుడు నౌబత్తుల నాగేశ్వరరావు, కొత్తపాడు, కాకిలేరు ప్రాంతాల కూటమి నాయకులు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో అండగా జనసేన నాయకులు

**రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జనసేన నాయకుడికి ఆర్థిక సాయం**



**తాడేపల్లిగూడెం, తొలివెలుగు:** తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, జనసేన సాధక్ ముఖమట్ల వెంకట ముత్యాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దవడకు శస్త్రచికిత్స అవసరం కావడంతో విషయం తెలుసుకున్న తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు రూ.1,15,000 ఆర్థిక సహాయాన్ని బొలిశెట్టి శ్రీనివాస్ కుమారుడు, జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ చేతుల మీదుగా వెంకట ముత్యాలకు అందజేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, బొలిశెట్టి రాజేష్ కుటుంబానికి వెంకట ముత్యాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు

# స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమష్టిగా సిద్ధం కావాలి: ఆరిమిల్లి రాధాకృష్ణ

**పార్వతీపురం,తొలివెలుగు:** స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సమష్టిగా సిద్ధం కావాలని తణుకు ఎమ్మెల్యే, జోనల్ ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధ్యక్షతన నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పకడ్బందీగా సిద్ధమై, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. ఇటీవల కూడా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి.





# మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తన

**ఆ పోలీసులను గుర్తించాలన్న తెలంగాణ హైకోర్టు**

**దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీకి హైకోర్టు ఆదేశం**

**సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని సూచన**

**వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని వ్యాఖ్యానించిన కోర్టు**

**సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ**

**తొలివెలుగు ,హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

# అమీర్‌పేట లాడ్జిలో మహిళ దారుణ హత్య.. పెళ్లి మాటెత్తడంతో ఘాతుకం!

**అమీర్‌పేట ఓయో లాడ్జ్‌లో శిరీష అనే మహిళ దారుణ హత్య**

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి గదికి తీసుకొచ్చిన ప్రియుడు శ్రీనివాస్**

**వివాహం ప్రస్తావనతో గొడవపడి, ఆమెను కొట్టి చంపిన నిందితుడు**

**తెల్లవారుజామున బిల్లు చెల్లించి అక్కడి నుంచి పరారైన శ్రీనివాస్**

**నకిలీ ఆధార్ కార్డులతో గది అద్దెకు తీసుకున్నట్లు పోలీసుల నిర్ధారణ**



**తొలివెలుగు హైదరాబాద్:** అమీర్‌పేటలో ఒక దారుణ ఘటన చోటుచేసుకుంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక మహిళను లాడ్జ్‌కు పిలిపించిన ప్రియుడు, ఆమెను దారుణంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం, వికారాబాద్ జిల్లా ధారూర్ మండలానికి చెందిన బేగరి శిరీష (34), అదే జిల్లా తాండూరు మండలానికి చెందిన అవుసలపల్లి శ్రీనివాస్ (38)లకు గతంలోనే పరిచయం ఉంది. శ్రీనివాస్‌పై గతంలోనూ నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శిరీష నగరంలోని ఒక కస్టమర్ కేర్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఆమెకు 2016లో విడాకులు కాగా, అప్పటి నుంచి శ్రీనివాస్ ఆమెను వివాహం చేసుకుంటానని నమ్మిస్తున్నాడు. ఈ క్రమంలో, ఈ నెల 24వ తేదీ రాత్రి వీరిద్దరూ అమీర్‌పేటలోని గోకుల్ ఫ్రైడ్ ఓయో లాడ్జ్‌కు చేరుకున్నారు. గణేశ్, దుర్గ అనే నకిలీ పేర్లతో ఆధార్ కార్డులు సమర్పించి, మొదటి అంతస్తులోని 103వ నంబర్ గదిలో బస చేశారు. సోమవారం (28వ తేదీ) రాత్రి పెళ్లి విషయంపై వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీనివాస్ ఆమెను తీవ్రంగా కొట్టి హతమార్చాడు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటలకు గది నుంచి బయటకు వచ్చిన శ్రీనివాస్, రిసెప్షన్‌లో బిల్లు చెల్లించాడు. శిరీష ఉదయం 9 గంటలకు గదిని ఖాళీ చేస్తుందని సిబ్బందికి చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం ఎంతసేపటికీ గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జ్ సిబ్బంది డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ప్రత్యామ్నాయ తాళంతో గదిని తెరిచి చూడగా, మంచంపై శిరీష విగతజీవిగా కనిపించింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడు శ్రీనివాస్ కోసం గాలిస్తున్నారు.

# రష్యాలో "కావేరి ఇంజన్" సత్తా.. భారత స్వదేశీ ఇంజన్ సిద్ధం.!

భారత్ స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన జెట్ ఇంజన్ "కావేరి" సత్తా చాటింది. రష్యాలో నిర్వహించిన కావేరి ఇంజన్ డ్రైరన్‌లో కీలక మైలురాయిని చేరకుకుంది. రష్యాలో నిర్వహించిన హై-ఆల్టిట్యూడ్, ఫ్లైట్ ట్రయల్స్‌లో అనుకున్నదాని కన్నా మరింత సమర్థవంతంగా పనిచేసింది. ఈ టెస్టుల్లో ఇంజన్ గరిష్టంగా 48.5 కిలోన్యూటన్ల డ్రై థ్రస్ట్ సాధించినట్లు తాజా రక్షణ రంగ నివేదికలు పేర్కొన్నాయి. నిర్దేశించిన 46 కిలోన్యూటన్ల థ్రస్ట్ లక్ష్యాన్ని అధిగమించింది. ఱ=ఱూకు చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (+ు=జు) అభివృద్ధి చేసింది. రష్యాలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏవియేషన్ మోటార్స్(జ×ూవీ), గ్రోమోవ్ ఫ్లైట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో కావేరి ఇంజన్‌ను పరీక్షించారు. తక్కువ ఉష్ణోగ్రత, తక్కువ వాయు పీడనం ఉండే అధిక ఎత్తు పరిస్థితుల్లో ఫ్లైట్ ట్రయల్స్ నిర్వహించారు. ఈ ఇంజన్ ప్రధానంగా డీఆర్డీఓ రూపొందించిన ఘాతక్ స్టెల్త్ డ్రోన్లలో ఉపయోగించే అవకాశం ఉంది.

# నిమ్స్ అధికారిపై ఏసీబీ సోదాలు.. బినామీల ఇళ్లలో కీలక పత్రాలు

**బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు**

**రూ.4.94 లక్షల నగదు స్వాధీనం**

**రూ.2.70 కోట్ల ప్లాట్ పత్రాలు గుర్తింపు**

**పెట్టుబడులు, భూముల డాక్యుమెంట్లపై దర్యాప్తు**






**తొలివెలుగు హైదరాబాద్:** నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆయనకు సంబంధించిన అనుమానితులు, బినామీల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నగదు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలు, ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్లు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలతో పాటు పలు కీలక ఆధారాలను అధికారులు గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.

### ధనరాజ్ ఇంట్లో నగదు స్వాధీనం

ఏసీబీ తనిఖీల్లో నిమ్స్ ఉద్యోగి ధనరాజ్ ఇంట్లో రూ.4,94,394 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే మహేశ్వరం ప్రాంతంలో మూడు వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ఈ భూముల విలువ సుమారు రూ.57 లక్షలు ఉంటుందని ఏసీబీ ప్రాథమికంగా పేర్కొంది.

### బంజారాహిల్స్‌లో రూ.2.70 కోట్ల ప్లాట్

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు కూడా సోదాల్లో బయటపడ్డాయి. ఈ ప్లాట్ విలువ సుమారు రూ.2.70 కోట్లు ఉంటుందని ఏసీబీ వివరించింది. ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఎవరి పేర్లపై ఉన్నాయి, వాటికి నోరి లక్ష్మీ భాస్కర్‌తో ఉన్న సంబంధం ఏంటి అనే కోణంలో అధికారులు వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### ఉద్యోగి పేరుతో పెట్టుబడులు

నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డి. గణేష్ పేరుతో సుమారు రూ.20 లక్షల పెట్టుబడులకు సంబంధించిన వివరాలను కూడా ఏసీబీ గుర్తించింది. మరో వ్యక్తి పేరుతో ఉన్న పెట్టుబడుల వివరాలు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొంది. వీటితో పాటు రూ.3 లక్షల హ్యాండ్ లోన్‌కు సంబంధించిన రసీదులను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### మరిన్ని ఆస్తులపై దర్యాప్తు

సోదాల్లో లభించిన పత్రాలు, నగదు, పెట్టుబడుల వివరాలు, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. నోరి లక్ష్మీ భాస్కర్‌కు తెలిసిన ఆదాయ వనరులతో పోలిస్తే గుర్తించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఏసీబీ తెలిపింది. ఇప్పటికే సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులకు సంబంధించిన వివరాలు బయటపడినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ సెప్టెంబర్ 21న కేసు నమోదు చేసినట్లు మీరు అందించిన ప్రెస్ నోట్‌లో పేర్కొంది. ఆ కేసు దర్యాప్తులో భాగంగానే అనుమానితులు, బినామీలుగా భావిస్తున్న వ్యక్తులకు సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ వెల్లడించింది. సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా మరిన్ని ఆస్తులు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

# బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీలో ట్విస్ట్.. కీపర్లదే కీలక పాత్ర.!

**మాజీ హవల్దార్‌కు కీపర్ల సహకారం**

**లక్షల్లో జరిగిన ఆర్థిక లావాదేవీలు**

**ఇద్దరు కీపర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**మల్లేశ్‌తో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్**



**తొలివెలుగు హైదరాబాద్:** సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారం మద్రాస్ ఆర్మీ రెజిమెంట్‌లో జరిగిన సంచలనాత్మక ఆయుధాల చోరీ కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసు విచారణలో కీలక పురోగతి లభించగా, ప్రధాన నిందితుడైన మాజీ హవల్దార్ మల్లేశ్‌కు ఆర్మీ ఆయుధాగారం (ఆర్మరీ) కీపర్లు పూర్తిస్థాయిలో సహకరించినట్లు పోలీసులు ఆధారాలతో సహా నిర్ధారించారు. ఈ నేరంలో భాగస్వామ్యమున్న ఆయుధాగారం కీపర్లు వినోద్, శేషులను పోలీసులు తక్షణమే అదుపులోకి తీసుకున్నారు.

### కీపర్లతో మల్లేశ్ కుమ్మక్కు.. రూ. లక్షల్లో ఆర్థిక లావాదేవీలు

మిలిటరీ క్యాంపులోని ఆయుధాగారం నుంచి తుపాకులు, బుల్లెట్లను దొంగిలించే క్రమంలో మల్లేశ్‌తో కలిసి వినోద్, శేషులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. ఈ చోరీకి సంబంధించి మాజీ హవల్దార్ మల్లేశ్ , ఈ ఇద్దరు కీపర్ల మధ్య భారీ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సాంకేతిక ఆధారాలను (టెక్నికల్ ఎవిడెన్స్) అధికారులు సేకరించారు. ఆయుధాలు చోరీ చేసి బయటకు తరలించినందుకు గానూ వారికి మల్లేశ్ భారీగా నగదు ముట్టజెప్పినట్లు భావిస్తున్నారు. ఇప్పటికే మల్లేశ్ నివాసంలో సోదాలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన అనేక ఆర్మీ ఆయుధాలను, భారీగా బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 10 రోజుల పోలీస్ కస్టడీలో ఉన్న మల్లేశ్‌ను పోలీసులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. విచారణలో భాగంగా చోరీ ఎలా జరిగింది, ఆయుధాలను ఏ విధంగా బయటకు తెచ్చారనే అంశాలను ప్రత్యక్షంగా నిర్ధారించుకోవడానికి మల్లేశ్‌ను బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌కు తీసుకెళ్లి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. కేసు విచారణ పురోగతిలో ఉండటంతో ఈ ఆయుధాల చోరీకి సంబంధించిన మరిన్ని సంచలన వివరాలు త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశముంది.

# కేతన్ హత్య 5 వేల పేజీల ఛార్జిషీట్..

పూణేలో కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. కేతన్‌కు కాబోయే భార్య సియా గోయల్, ఆమె లవర్ చేతన్ చౌదరిలు కలిసి కేతన్ లోహగఢ్ కోటపై నుంచి తోసి హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు 5053 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో దారుణమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. చేతన్‌ను హత్య చేసేందుకు సియా, చేతన్ వీరిద్దరి స్నేహితుడు రితేష్ హాంగేలు కలిసి పనిచేసినట్లు ఛార్జిషీట్ పేర్కొంది. ఈ హత్యను ప్రమాదంగా చూపించేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఫోన్ డేటాను వాడుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఛార్జిషీట్లో మొబైల్ డేటా, వాట్సాప్ కాల్, కాల్ డీటెయిల్ రికార్డులు, ఫోటోలు, సాక్షుల వాంగ్మూలాలు , సాంకేతిక విశ్లేషణ వివరాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాదాపుగా 80-85 మంది సాక్షులు వాంగ్మూలాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### హత్య కోసం గూగుల్‌లో సెర్చ్..

సియా, చేతన్‌లు హత్య తర్వాత సాక్షాలను, ఆధారాలను తొలగించడం, విష ప్రయోగం, డిజిటల్ ఆధారాలను తొలగించడంపై గూగుల్‌లో సెర్చ్ చేసినట్లు తేలింది. విషపూరిత పుట్టగొడుగుతో ఎలా చంపడం వంటి వాటిని వెతికారు. ఇదే కాకుండా మేఘాలయ సోనమ్ రఘువంశీ చేసిన హత్య గురించి సెర్చ్ చేశారు. హత్యకు ఎంచుకున్న లోహగఢ్ కోట గురించి ఇంటర్నెట్లో వెతికి తెలుసుకున్నారు. ఇదే కాకుండా మనుషుల్ని ఎలా తప్పుదారి పట్టించాలనే విషయాలను తెలుసుకున్నారు. లోహగఢ్ పోర్టులో హత్యకు ముందు అక్కడ రెక్కీ నిర్వహించారు. మే 28న, 29న ఆ ప్రదేశాన్ని పరిశీలించినట్లు ఛార్జిషీట్ వెల్లడించింది. హత్యకు ముందే మే 31న సియా కేతన్‌ను లోహగఢ్ తీసుకెళ్లినట్లు కూడా పోలీసులు తెలిపారు. జూన్ 14న కేతన్‌ను అక్కడికి తీసుకెళ్లి హత్యకు ప్రయత్నించి విఫలమైనట్లు, ఆ తర్వాత జూన్ 18న మరోసారి టెక్కింగ్ పేరులో కేతన్‌ను లోహగఢ్ పోర్టుకు తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలింది.

### సియా, చేతన్ కలిసి తోశారు..

ఛార్జిషీట్ ప్రకారం, జూన్ 18న లోహగఢ్ పోర్టుకు తీసుకెళ్లిన తర్వాత కొండ ప్రాంతంలో కేతన్‌ను చేతన్, సియాలు కలిసి వెనక నుంచి తోసేసి చంపినట్లు తేలింది. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ముందుగానే ఒక కథ సిద్ధం చేసకున్నారని పోలీసులు ఆరోపించారు. కేతన్ జారిపడిపోయినట్లు కుటుంబ సభ్యుల్ని నమ్మించే ప్రయత్నం చేశారు.

ఈ కేసులో డిజిటల్ ఆధారాలు దొరక్కుండా ఇద్దరు జాగ్రత్తలు తీసుకున్నారని తేలింది. గూగుల్, యూట్యూబ్ సెర్చ్ హిస్టరీ, ఐక్లౌడ్ డేటా, వాట్సాప్ చాట్స్, కాల్ లాగ్స్, ఫోటోలు తొలగించినట్లు తేలింది. ఇదే కాకుండా మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు అనుమానం కలిగించేందుకు ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. చేతన్ తన ఫోన్ లొకేషన్ దాచేందుకు వేరే వ్యక్తి మొబైల్ తీసుకుని హత్య ప్రదేశానికి వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి: మోహన్ భగవత్

**చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్**

**అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన**

**ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి**

**అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు**

**తొలివెలుగు మహారాష్ట్ర:** అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.



TGTEL/26/A6221
తొలి వెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
యాదాద్రి భువనగిరి బుధవారం 30 సెప్టెంబర్ 2026





# అమెరికా నుంచి భారత్‌కు భారీ ఊరట.. వాటిపై 0% టారిఫ్..!

అమెరికా తమ దేశంలోకి దిగుమతి అయ్యే కొన్ని రకాల ప్రాణాంతక వ్యాధుల మందులు, వాటి తయారీలో వాడే కీలక పదార్థాలపై ఎలాంటి అదనపు రవాణా పన్నులు (యాడ్ వాలోరెమ్ టారిఫ్‌లు) వేయకూడదని కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సహా 20 దేశాలకు ఈ రాయితీ ఇస్తున్నట్లు అమెరికా వాణిజ్య శాఖ అధికారికంగా ఒక నోటీసు విడుదల చేసింది. సెప్టెంబర్ 29 నుంచి పేటెంట్ పొందిన కొన్ని రకాల మందుల దిగుమతులపై ఏకంగా 100 శాతం పన్ను విధించేందుకు వాషింగ్టన్ సిద్ధమవుతున్న సమయంలో ఈ నిర్ణయం రావడం విశేషం. తీవ్రమైన జబ్బులకు వాడే మందులు, సంతానలేమి చికిత్సలు, సెల్ థెరపీ, జీన్ థెరపీ, యాంటీబాడీ-డ్రగ్ కాంజుగేట్స్, అలాగే జంతువులకు వాడే మందులతో పాటు వీటి తయారీకి ఉపయోగించే కీలక కాంపోనెంట్లకు కూడా పన్నుల నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ఇక్కడ 'యాడ్ వాలోరెమ్' పన్ను అంటే ఒక వస్తువు ధర ఆధారంగా నిర్ణయించే ఒక నిర్దిష్ట శాతం. అమెరికాతో ఇప్పటికే వర్తక, భద్రతా ఒప్పందాలు ఉన్న లేదా భవిష్యత్తులో చేసుకోబోయే దేశాలకే ఈ పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ జాబితాలో భారతదేశంతో పాటు అర్జెంటీనా, బంగ్లాదేశ్, కంబోడియా, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, యూరోపియన్ యూనియన్, గౌతమాలా, ఇండోనేషియా, జపాన్, జోర్డాన్, మలేషియా, నార్త్ మాసిడోనియా, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్, లీచ్టెన్‌స్టెయిన్, తైవాన్, థాయ్‌లాండ్, బ్రిటన్, వియత్నాంలు ఉన్నాయి. తమ దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించే లక్ష్యంతో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న ఒక కీలక ఆదేశం ఇచ్చారు. ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్‌లోని సెక్షన్ 232 కింద పేటెంట్ పొందిన ఫార్మా ఉత్పత్తులపై 100 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. ఈ పన్ను జూలై 31 నుంచే కొన్ని కంపెనీలకు అమల్లోకి రాగా, మిగిలిన సంబంధిత కంపెనీలన్నింటికీ సెప్టెంబర్ 29 నుంచి వర్తించనుంది.

# నవంబర్ 1 నుంచి వర్క్ ఫ్రం హోం..

ఢిల్లీలో శీతాకాలంలో వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు, పరిశుభ్రమైన గాలిని అందించేందుకు ఢిల్లీ ప్రభుత్వం ఆంక్షలను ప్రకటించింది. నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు అమలులోకి రానున్న ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రైవేట్ వాహనాల వాడకాన్ని తగ్గించడానికి పార్కింగ్ స్థలాలలో ఛార్జీలను రెట్టింపు చేయనున్నారు. అయితే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ పరిధిలోని పార్కింగ్ స్థలాలకు దీని నుంచి మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగుల రాకపోకల రద్దీని నియంత్రించడానికి ఆఫీస్ సమయాల్లో మార్పులు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ కార్యాలయాలు ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు, ఢిల్లీ ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10:00 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పనిచేస్తాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితో మాత్రమే పనిచేయాలని, మిగతా 50 శాతం మంది ఇంటి నుంచి (వర్క్ ఫ్రమ్ హోమ్) విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కాలుష్య నియంత్రణలో భాగంగా అక్టోబర్ 1 నుంచి చెల్లుబాటు అయ్యే పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. సరైన పీయూసీ సర్టిఫికేట్ లేని వాహనాలకు నిబంధనల ప్రకారం రూ. 10,000 వరకు జరిమానా విధిస్తారు. పీయూసీ కేంద్రాల పనితీరును మరింత నమ్మకమైనదిగా మారుస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక నిర్మాణ రంగంపై కూడా తీవ్రమైన ఆంక్షలు అమలవుతాయి. నవంబర్ 1 నుంచి జనవరి 31 వరకు దుమ్మును వెలువరించే కూల్చివేతలు, బహిరంగ సివిల్ నిర్మాణ కార్యకలాపాలపై నిషేధం ఉంటుంది. డిసెంబర్ 10 నుంచి జనవరి 20 వరకు అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులపై సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఢిల్లీ అత్యధిక కాలుష్యం ఉన్న ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ వార్షిక సగటు పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు 101 మైక్రోగ్రాములుగా నమోదైంది. ఇది భారతీయ ప్రమాణం కంటే 2.5 రెట్లు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాల కంటే 20 రెట్లు ఎక్కువ. చండీగఢ్ 70 మైక్రోగ్రాములతో రెండో స్థానంలో, హర్యానా 63, త్రిపుర 62 మైక్రోగ్రాములతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం 749 జిల్లాల్లో దాదాపు 60 శాతం జిల్లాలు జాతీయ వార్షిక పీఎం2.5 ప్రమాణాలను అధిగమించినట్లు నివేదిక పేర్కొంది. ప్రజలందరికీ స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది.



# అక్టోబర్‌లో ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా?

**ఈ 10 ప్రదేశాలు అస్సలు మిస్ కావొద్దు..**

సెప్టెంబర్ ముగింపునకు వచ్చేసింది.. అక్టోబర్ నెల ప్రారంభం కాబోతోంది.. ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోయినా.. ఇక, అక్టోబర్ నెల వచ్చిందంటే.. వర్షాకాలం ముగిసినట్టే.. ఇదే టూర్‌లకు మంచి నెలగా భావిస్తారు.. టూరిస్టులకు అక్టోబర్ నెల ఎంతో అనుకూలమైన సమయంగా పరిగణిస్తారు. వర్షాకాలం ముగిసిన తర్వాత చాలా ప్రాంతాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది. ఎండల తీవ్రత తగ్గడంతో పాటు చలి కూడా పెద్దగా ఉండదు. దీంతో ప్రకృతి అందాలు, చారిత్రక ప్రదేశాలు, బీచ్‌లు, పర్వత ప్రాంతాలను సందర్శించేందుకు ఇది మంచి సమయంగా ఉంటుంది. అయితే, భారతదేశంలో అక్టోబర్‌లో విభిన్న అనుభూతులను అందించే అనేక ప్రాంతాలు ఉన్నాయి. ఎక్కడో తెల్లటి ఉప్పు మైదానాలు ఆకట్టుకుంటే.. మరెక్కడో పర్వతాలు, జలపాతాలు, పచ్చని అడవులు మంత్రముగ్ధులను చేస్తాయి. రాజస్థాన్‌లో కోటలు, రాజభవనాలతో పాటు ఎడారి సంస్కృతిని ఆస్వాదించవచ్చు. బీచ్ విహారయాత్ర కోరుకునేవారికి గోవా ఆకర్షణీయమైన ఎంపిక. అక్టోబర్‌లో సందర్శించగల 10 ప్రాంతాల్లో ముఖ్యమైన కొన్ని ప్రదేశాలు ఇవి.



### రాన్ ఆఫ్ కచ్ -గుజరాత్

గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్ విశాలమైన తెల్లటి ఉప్పు మైదానాలకు ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా వెన్నెల రాత్రుల్లో తెల్లటి ఎడారి అందాలు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయి. ఇక్కడ గుజరాత్ జానపద సంస్కృతి, సంప్రదాయ సంగీతం, నృత్యం, స్థానిక వంటకాలు, హస్తకళలను దగ్గరగా ఆస్వాదించవచ్చు. ఒంటె సవారీలు, టెంట్ సిటీ వంటి అనుభవాలు కూడా అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ చివర్లో లేదా నవంబర్ ప్రారంభంలో రాన్ ఉత్సవ్ ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో ఈ ప్రాంతానికి మరింత ప్రత్యేకత ఉంటుంది.

### జైసల్మేర్-రాజస్థాన్

రాజస్థాన్ మంచి టూరిస్టు స్పాట్‌గా చెబుతారు.. ఎడారి, కోటలు, రాజస్థానీ సంస్కృతిని ఆస్వాదించాలనుకునేవారికి జైసల్మేర్ ఆకర్షణీయమైన గమ్యస్థానం. బంగారు ఇసుక దిబ్బలు, ఒంటె సవారీలు, జానపద సంగీతం, సంప్రదాయ రాజస్థానీ వంటకాలు పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయి. చారిత్రక జైసల్మేర్ కోట ఇక్కడి ప్రధాన ఆకర్షణల్లో ఒకటి. ముఖ్యంగా సూర్యాస్తమయ సమయంలో బంగారు వర్ణంలో మెరిసే ఇసుక దిబ్బలను చూడటం మరో ప్రత్యేక అనుభవంగా ఉంటుంది. జైసల్మేర్ విమానాశ్రయం నగరానికి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉండగా, రైల్వే స్టేషన్ నగర కేంద్రానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉంది.

### పచ్మర్హి -మధ్యప్రదేశ్

ఇక, మంచి ప్రకృతి ప్రశాంతతను ఆస్వాదించాలనుకునేవారు మధ్యప్రదేశ్‌లోని పచ్మర్హిని సందర్శించవచ్చు. పర్వతాలు, పచ్చని లోయలు, జలపాతాలు, గుహలు, దేవాలయాలతో ఈ హిల్‌స్టేషన్ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుంది. బీ ఫాల్స్, ధూప్‌ఘర్, జటాశంకర్ గుహలు, రజత్ ప్రపత్, అప్సర విహార్ వంటి ప్రదేశాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణలు. పచ్మర్హికి సమీపంలోని భోపాల్ రాజా భోజ్ విమానాశ్రయం సుమారు 145 కిలోమీటర్ల దూరంలో ఉండగా, పిపారియా రైల్వే స్టేషన్ సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది..

### గోవా

దేశంలోని మంచి టూరిస్టు స్పాట్‌గా గోవాను చెబుతారు.. బీచ్‌లు, సముద్రం, జలక్రీడలు, వినోదం కోరుకునేవారికి గోవా ఎప్పటికీ ప్రసిద్ధ గమ్యస్థానమే. అక్టోబర్‌లో వర్షాకాలం ముగిసిన తర్వాత వాతావరణం క్రమంగా ప్రయాణాలకు అనుకూలంగా మారుతుంది. బీచ్‌లలో సమయం గడపడంతో పాటు జలక్రీడలు, పురాతన చర్చిలు, పోర్చుగీస్ వాస్తుశిల్పం, స్థానిక మార్కెట్లను సందర్శించవచ్చు. బీచ్ షాక్‌లు, రాత్రి జీవితం కూడా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. అక్టోబర్ నుంచి పండుగల సీజన్ ప్రారంభమవుతుంది. పనాజీ నుంచి దాబోలిమ్ విమానాశ్రయం సుమారు 29 కిలోమీటర్ల దూరంలో ఉండగా, మడ్గావ్ రైల్వే స్టేషన్ సుమారు 36 కిలోమీటర్ల దూరంలో ఉంది.

### కూర్గ్ - కర్ణాటక

ఇక, ప్రకృతి ప్రేమికులకు మరో స్వర్గధామం.. పచ్చని ప్రకృతి, కాఫీ తోటలు, దట్టమైన అడవులకు కూర్గ్ ప్రసిద్ధి చెందింది. సుగంధ ద్రవ్యాల తోటలు, ప్రశాంతమైన వాతావరణం ఇక్కడి ప్రత్యేకతలు. అక్టోబర్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం పర్యటనను మరింత ఆస్వాదించేలా చేస్తుంది. కాఫీ తోటల్లో పర్యటిస్తూ ప్రకృతి మధ్య సమయం గడపడం ఇక్కడి ప్రత్యేక అనుభవాల్లో ఒకటి. మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 165 కిలోమీటర్ల దూరంలో ఉండగా, మైసూరు రైల్వే స్టేషన్ సుమారు 95 కిలోమీటర్ల దూరంలో ఉంది.

### నవల్‌గఢ్ -రాజస్థాన్

రాజస్థాన్‌లోని షెఖావతి ప్రాంతంలో ఉన్న నవల్‌గఢ్ పురాతన భవనాలు, వాటిపై కనిపించే రంగురంగుల కుడ్యచిత్రాలకు ప్రసిద్ధి చెందింది. హవేలీల గోడలపై కనిపించే సంప్రదాయ చిత్రకళ, కళాత్మక అలంకరణలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. రాజస్థాన్ కళ, సంస్కృతి, ప్రాచీన వాస్తుశిల్పంపై ఆసక్తి ఉన్నవారు నవల్‌గఢ్‌ను సందర్శించవచ్చు. ఇక్కడి అనేక ప్రాంతాలు సినిమా, టీవీ షూటింగ్‌లకు కూడా ఉపయోగించబడ్డాయి. జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 126 కిలోమీటర్ల దూరంలో ఉండగా, నవల్‌గఢ్ రైల్వే స్టేషన్ నగర కేంద్రానికి సుమారు 1 కిలోమీటర్ దూరంలో ఉంది.

# పండుగలకు ముందే ఊరట..




ఆయిల్ ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతుండగా.. వారికి శుభవార్త చెప్పింది కేంద్రం.. పండుగ సీజన్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంట నూనెల ధరలను తగ్గించే చర్యల్లో భాగంగా ముడి, శుద్ధి చేసిన పామాయిల్, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని తగ్గించింది. ఈ మార్పులు సెప్టెంబర్ 24, 2026 నుంచి అమల్లోకి వచ్చాయి.. అంటే ఇవాళ్టి నుంచే అమలు కానుంది.. ముడి పామాయిల్, ముడి సోయాబీన్ నూనెపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. శుద్ధి చేసిన పామాయిల్, సోయాబీన్ నూనెపై సుంకాన్ని 32.5 శాతం నుంచి 27.5 శాతానికి తగ్గించారు. ఇక ముడి పొద్దుతిరుగుడు నూనెపై సుంకాన్ని 10 శాతం నుంచి పూర్తిగా ఎత్తివేయగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు నూనెపై సుంకాన్ని 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించారు. ప్రాథమిక కస్టమ్స్ సుంకంతో పాటు వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్, సోషల్ వెల్ఫేర్ సర్‌చార్జ్‌లు కూడా వర్తిస్తాయి. తాజా మార్పుల తర్వాత ముడి పామాయిల్, సోయాబీన్ నూనెపై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి, ముడి పొద్దుతిరుగుడు నూనెపై 16.5 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గనుంది. గత ఏడాది కాలంలో భారత్‌లో కూరగాయల నూనెల ధరలు దాదాపు 20 శాతం పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు పండుగల సమయంలో స్వీట్లు, స్నాక్స్, వేయించిన పదార్థాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో దిగుమతి వ్యయం తగ్గడం ద్వారా దేశీయ ధరలపై ఒత్తిడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అయితే తగ్గిన దిగుమతి వ్యయం ఎంతవరకు వినియోగదారులకు చేరుతుందనేది సరఫరా గొలుసుపై ఆధారపడి ఉంటుంది. భారత్ తన కూరగాయల నూనె అవసరాల్లో దాదాపు మూడింట రెండు వంతులను దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. పామాయిల్, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలను ప్రధానంగా మలేషియా, ఇండోనేషియా, అర్జెంటీనా, రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. తాజా సుంకాల తగ్గింపుతో రిఫైనర్లకు దిగుమతులు పెంచే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. పొద్దుతిరుగుడు నూనె ఈ నిర్ణయం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందని పతంజలి ఫుడ్స్ వైస్ ప్రెసిడెంట్ ఆశిష్ ఆచార్య రాయిటర్స్‌తో పేర్కొన్నారు. ఇది రిఫైనర్లకు మరింత ఆకర్షణీయంగా మారడంతో సోయాబీన్, పామాయిల్‌తో పోలిస్తే పొద్దుతిరుగుడు నూనెకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మరి, ఇది వంటె నూనెల వినియోగదారులకు ఏ మేరకు ఊరట కలిపిస్తుందో వేచి చూడాలి..



# ఈ అవార్డు వారికే అంకితం

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను సంతోషంలో మునిగి తేలుతున్నది. ఆమె నటించిన తాజా సినిమా 'గాంధారి' ఇటీవలే ఓటీటీలో విడుదలై విశేష స్పందన చూరగొనడమేకాక, కథానాయిక తాప్సీకి 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్ -- 2026' అవార్డుని కూడా కట్టబెట్టింది. ఈ సందర్భంగా తాప్సీ మాట్లాడుతూ 'ఎలాంటి ప్లానింగ్ లేకుండానే నా సినీప్రయాణం మొదలైంది.

ప్రతి ఏడాదీ నేను ఏదో ఒక అవార్డు గెలుచుకుంటున్నానంటే కారణం, నా తోటి నటీమణులే. వాళ్లు తమ అభినయంతో ప్రమాణాలకు పెంచకపోతే.. వాటిని అందుకునేందుకు నేను శ్రమించేదాన్ని కాదేమో. ఇండస్ట్రీలో మంచి పాత్రల కోసం తపించే ప్రతి మహిళకూ ఈ అవార్డు అంకితం. నా చుట్టూ ఉన్న సాధారణ మహిళల జీవితాలే నా పాత్రలకు ప్రేరణ. ఆ జీవితాలను తెరపై ప్రతిబింబించడమే నాలక్ష్యం' అంటూ చెప్పుకొచ్చింది తాప్సీ పన్ను.

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి 'ఎత్తర ఎత్తు' సాంగ్ విడుదల!

టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' జానకిరామ్ మారెల్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మూడో సింగిల్ అయిన ఎత్తర ఎత్తు లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యమందించగా, నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు. బాలు.ఎస్ కీస్ ప్రోగ్రామింగ్, లక్ష్మీనారాయణ టీమ్ లైవ్ రిథమ్స్, రాబిన్ సెబాస్టియన్ గిటార్ అండ్ బాస్ అందించగా, బాలు.ఎస్ మిక్స్ అండ్ మాస్టరింగ్ చేశారు. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాధికా శరత్‌కుమార్, షైన్ టోమ్ చాకో, ఉపేంద్ర లీమాయ్ తదితరులు కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి మరియు కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్ణాటి, సీత కర్ణాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# విడుదలకు ముందే షాక్.. ఆన్‌లైన్‌లో 'తెల్లకాగితం' సినిమా కంటెంట్ లీక్!

అక్టోబర్ 2న అట్టహాసంగా థియేటర్లలో విడుదల కావాల్సిన టాలీవుడ్ సినిమా 'తెల్లకాగితం' చిత్ర యూనిట్‌కు భారీ షాక్ తగిలింది. సినిమా విడుదలకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉండగా.. ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన కంటెంట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర నిర్మాతతో పాటు టెక్నీషియన్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఈ వ్యవహారంపై స్పందించిన 'తెల్లకాగితం' చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన లీకైన కంటెంట్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేయవద్దని, సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని మరియు ఇతరులకు సర్క్యులేట్ చేయవద్దని ప్రేక్షకులను హృదయపూర్వకంగా కోరింది. మా చిత్రం 'తెల్లకాగితం'కు సంబంధించిన కంటెంట్ అనుమతి లేకుండా ప్రచారం చేయబడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ను చట్టపరంగా లీక్ చేయడాన్ని, షేర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. లీకైన కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని, డౌన్‌లోడ్ చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సినిమాను కేవలం థియేటర్‌లలోనే వీక్షించి మా చిత్రబృందానికి మీరంతా సంపూర్ణ మద్దతు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. అంటూ తెల్లకాగితం చిత్ర బృందం ప్రెస్ నోట్ విడుదల చేసింది. సినిమా సక్సెస్ వెనుక ఎంతోమంది కష్టపడతారని, ఇలాంటి పైరసీ చర్యలు మరియు లీక్‌లు చిత్ర యూనిట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రేక్షకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, లీక్ అయిన వీడియోలను ఎంకరేజ్ చేయకుండా కేవలం థియేటర్లలోనే సినిమాను చూసి విజయవంతం చేయాలని సినీ పరిశ్రమ కోరుతోంది.

# శివకార్తికేయన్‌తో ఎలాంటి గొడవలు లేవు.. పుకార్లకు చెక్ పెట్టిన దర్శకుడు వెంకట్ ప్రభు!

తమిళ స్టార్ నటుడు శివకార్తికేయన్‌తో తన సినిమా ఆగిపోవడంపై వస్తున్న వార్తలు, తన తండ్రి గంగై అమరన్ చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు స్పందించాడు. శివకార్తికేయన్ 27వ సినిమా కోసం ముందుగా వెంకట్ ప్రభునే దర్శకుడిగా ప్రకటించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. దాంతో సత్యజ్యోతి ఫిలింస్ బ్యానర్‌లో 'పార్కింగ్' చిత్ర దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఈ ప్రాజెక్ట్‌ను టేకప్ చేశారు. ప్రస్తుతం శివకార్తికేయన్ ఈ కొత్త చిత్రంతో పాటు 'సెయోన్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వెంకట్ ప్రభు తండ్రి, సంగీత దర్శకుడు గంగై అమరన్ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తన కుమారుడి దర్శకత్వ ప్రాజెక్ట్ ఆలస్యం కావడానికి ఒక నటుడే కారణమని, ఆ ప్రాజెక్ట్ తీసుకోవద్దని తాను ముందే వెంకట్ ప్రభుకు సలహా ఇచ్చానని గంగై అమరన్ పేర్కొన్నారు. ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకపోయినా, నెటిజన్లు మాత్రం ఆ నటుడు శివకార్తికేయనే అంటూ పెద్దఎత్తున చర్చ మొదలుపెట్టారు. గతంలో వీరు కలిసి అమెరికాలో వీఎఫ్ఎక్స్ పనుల కోసం ప్రీ-ప్రొడక్షన్ వర్క్ చేయడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది.






# ఓటీటీలోకి 'బెత్లెహెం కుటుంబ యూనిట్'..

మలయాళంలో ఇండస్ట్రీ హిట్ సాధించిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' చిత్రం డిజిటల్ ఎంట్రీకి సిద్ధమైంది. నివిన్ పౌలీ, మమిత బైజు జంటగా నటించిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్‌లో (జీఱశీసశేర్ఘుతీ) స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని సదరు ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అధికారికంగా ప్రకటించింది. గిరీష్ ఏడీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఓనం పండుగా కానుకగా ఆగస్ట్ 21న థియేటర్లలో విడుదలై దాదాపు రూ 320 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. థియేటర్లలో ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శితమవుతూనే మరోవైపు ఓటీటీలోకి వస్తుండటం విశేషం. కేరళలోనే కాకుండా ఇతర ప్రాంతాల ప్రేక్షకులను కూడా ఈ సినిమా ఎంతగానో ఆకట్టుకుంది. ఈ చిత్రంలో నివిన్ పౌలీ 'జస్టిన్' అనే పెళ్లికాని యువకుడిగా నటించగా, ఆయన పక్కనే ఉన్న కాలనీకి 'యాష్లీ'గా మమిత బైజు వచ్చాక జస్టిన్ జీవితంలో జరిగే మార్పుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. పెద్దగా నాటకీయ మలుపులు లేకుండా చాలా సింపుల్ అండ్ బ్యూటిఫుల్ లవ్ స్టోరీగా దీన్ని తెరకెక్కించారు. యువత మనసులను హత్తుకునేలా భావోద్వేగాలతో ఈ సినిమా సాగుతుంది. ఇందులో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ, వినయ్ ఫోర్ట్, శ్రీంద, శ్యామ్ మోహన్ తదితరులు సహాయక పాత్రల్లో నటించారు.

# బిడ్డను వదిలి షూటింగ్‌కు వెళ్లినప్పుడు మూడు గంటలు ఏడ్చాను

తల్లిగా మారిన తర్వాత తన అనుభవాల గురించి బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు నీర్‌ను వదిలి తొలిసారి పని కోసం ప్రయాణించినప్పుడు తాను మామ్ గిల్ట్‌కు (తీవ్రమైన అపరాధ భావన) గురయ్యానని తెలిపారు. ప్రసవం తర్వాత చాలా నెలలు బాబుతోనే ఉన్న తాను, తొలిసారి దూరంగా ప్రయాణిస్తున్నప్పుడు విమానంలో దాదాపు మూడు గంటల పాటు ఏడుస్తూనే ఉన్నానని, ఆ ప్రయాణం తనకు సరిగ్గా గుర్తులేదని ఆమె భావోద్వేగంగా చెప్పారు. ఇంట్లో కుటుంబ సభ్యులు బాబును బాగా చూసుకుంటున్నా, మీ బాబు ఎక్కడ? అంటూ సమాజం నుంచి ఎదురయ్యే ప్రశ్నలు తల్లులపై మరింత మానసిక ఒత్తిడిని పెంచుతాయని ఆమె పేర్కొన్నారు. కాగా, రాఘవ్ చద్దా, పరిణీతి దంపతులకు అక్టోబర్ 19, 2025న బాబు (నీర్) జన్మించాడు. ప్రస్తుతం పరిణీతి తన రీఎంట్రీ ప్రాజెక్ట్ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'షక్: ట్రస్ట్ నో వన్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com